# (అ) భూతకల్పన

**"ఆ దరిద్రపుకొంప మీద** పైసా రాబడి లేకపోగా, పన్ను కట్టమని మళ్లీ నోటీసు వచ్చింది. దాన్ని తగలబెట్టేద్దామన్నా కిరోసిన్ కొనడానికి మన దగ్గరి డబ్బు చాలదు" అన్నాడు వాసు ఆరోసారి.

దరిద్రపుకొంపకు విగ్రహవాక్యం 'దరిద్రుని యొక్క కొంప' అయితే వాసు వర్ణన కరక్టే. కానీ దరిద్రం అన్నది 'రిలెటివ్' అనీ, ఎవరితో ఎవరిని పోలుస్తున్నామో గమనించాలనీ అంటాను. వాసు నాలాగే జమీందార్ల బిడ్డ. 'బిడ్డ' అనడంకంటే 'మనుమడు' అనడం సబబు. వాసు తండ్రి నాటికే జమీ ఊడ్చిపెట్టుకుపోయింది. దానికి ఆయన స్వయంకృషి కొంత కారణమయితే, వాసూ తాతగారి అమిత ఖుషీ కొండంత కారణం.

'రాగ్స్ టు రిచెస్' కథలు చదివినంత ఉషారుగా 'రిచెస్ టు రాగ్స్' కథలు తెలుసుకోవడానికి జనాలు ఉత్సుకత చూపరు. కాబట్టి వివరాలు వదిలేసి, వాసు ప్రస్తుతం తన నిరుద్యోగాన్ని నిలబెట్టుకోడానికి కష్టపడుతున్నాడని చెబితే చాలనుకుంటాను. నిర్వ్యాపారంగా ముప్పై అయిదేళ్లు గడిపేశాక ఈ రోజు ఏదైనా పనిచేయందే డబ్బు రాని పరిస్థితి వచ్చిందంటే ఎంత కటకటో అనుభవించిన వాడికే తెలుస్తుంది.

తండ్రి నుంచి సంక్రమించిన ఆస్తి వాసు యథాశక్తి తగలేస్తున్న తరుణంలోనే కొంపగా ఉదహరించబడ్డ బంగళా అతని పాలబడింది. అది వాళ్ల తాతగారు తన స్నేహితురాలి కోసం ఊరికి దూరంగా 'ఫార్ ఫ్రం ది పీపింగ్ క్రౌడ్' కట్టిచ్చిన ఏకాంత సౌధం. అయితే ఆ చిన్నది తాత గారికంటే బహుచిన్నది కావటంతో మూడేళ్ల క్రితం దాకా బతికింది. అంతకాలం బతికే ఉండటానికి భవంతిలోని ఆయిల్ పెయింటింగ్స్, శాండిలియర్లు, గాజుదీపాలు, సోఫాలు, తివాచీలు వగైరా ఫర్నీచర్‌లో అమ్మగలిగినన్ని అమ్ముకుంది. మోసుకెళ్లడానికి కూలీడబ్బులు కూడా గిట్టుబాటుకాని సరుకులు మిగిలాయి. పోతూపోతూ ఆ వంశంలో మిగిలిన ఏకైక వారసుడు వాసుకి ఆ మేడ రాసిపోయింది. ఆ విధంగా ఆవిడ కృతజ్ఞతాభారం తీర్చుకుందేమోగానీ, వాడిమీద ఓపలేని భారం మోపినట్లయింది.

రాజుగారు బహుమతిచ్చిన ఏనుగుని పోషించడానికి పేదవాడు పడేపాట్లు కథల్లో చదువుతాం. వాటిల్లోలా ఏనుగుని అమ్మడానికి వీలులేని సంకటస్థితి వాసుకి లేదు. కానీ అమ్మకానికి అడ్డుపడే రోజులు లేకపోయినా కొనడానికి ముందుకొచ్చే మారాజులు కూడా లేరు. వీళ్లకి దగ్గర్లోనే ఉన్న బంగళా వారసులు వీరగిరి రాజావారి స్థితి కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఆయనా సిటీలోనే ఉంటూ ఆ భవంతిని పాడుపెట్టేశాడు.

అద్దెకివ్వడానికి గానీ, అమ్మడానికిగానీ వీలులేక తన బిల్డింగు కూలి ఎవరిమీదనైనా పడితే నష్టపరిహారం కూడా అచ్చుకోవాలేమోనని వాడు భయపడుతున్న టైములో ప్రభుత్వం వారు పన్నుకోసం వెంటబడ్డారు. ఇటీవల ఆ భవంతి మునిసిపాలిటీ పరిధిలోకి వచ్చాక పన్నుపోటు ఎక్కువయింది కూడా!

స్వతహాగా బద్ధకస్తుడినే అయినా వాసు కోసం బుర్రను వెచ్చించి ఒక పథకాన్ని రూపొందించాను!

"చూడు వాసూ! ఆ ఇంటిని వదల్చుకుందామని చూడడం కంటే దాన్ని 'ఎన్‌కాష్' చేసుకోవడం

ఎమ్బీయస్ ప్రసాద్

మంచిది. ఉదాహరణకి అది 'దయ్యాలు పట్టిన ఇల్లు' అని ప్రజల్లో వదంతి పుట్టించావనుకో. దానికి ఆ హంగులన్నీ ఉన్నాయి కూడా! జనాలు ఉత్సుకత పుట్టి ఎగబడతారు; సినిమావాళ్లు షూటింగులకు అడుగుతారు, పరిశోధకులు పరిశోధనలకు వస్తారు. దెయ్యాలచే ఓ 'రోప్ ట్రిక్' కూడా చేయిస్తే ఆడామగా ఫారిన్ టూరిస్టులు లాగులేసుకొచ్చి 'రియల్ ఇండియా ఇదే కదా' అంటూ తయారవుతారు. ఆ లాగులను చూడడానికి నల్లజనాభా పుట్టుకొస్తారు. అందరికీ టిక్కెట్లు పెడదాం, బాగుండదంటే 'అనుమతి పత్రం ఇస్తాం, రుసుము కట్టండి' అందాం"


"అయిడియా బాగుందే. ఇది నీ అంతట నీకే పుట్టిందా? లేక ఇందాకా నేను దాన్ని 'భూతగృహం' అని తిట్టినప్పుడు తట్టిందా?"

"అఫ్‌కోర్స్, ఇన్‌స్పిరేషన్ నీదేననుకో! తప్పులేదు. వాల్మీకికే తప్పలేదీ అవసరం! బోయవాడు బాణాలు వేయకపోతే వాల్మీకి రామాయణం రాసేవాడా? అయితే చిన్న సవరణ – నువ్వు 'భూతాల కొంప' అన్నది ఇప్పుడు కాదు. క్రితం సెషన్లో – అంటే మొన్న! ఈ లోపున కానీ పెట్టుబడి లేకుండా దాన్ని 'దెయ్యాలకొంప'గా మార్చే ఏర్పాట్ల గురించి వాకబు చేశాం. నీ అనుమతి గురించే ఆగాను"

"పెట్టుబడి లేదన్నప్పుడు అడ్డు పెట్టేందుకేముంది? త్వరగా చెప్పరా బాబూ"

చెప్పడం కాదు. చేసి చూపించా.

ఆదివారం నాడు స్పెషల్ ఎఫెక్ట్స్ టీము లీడరు సుందరాన్నీ, వాసునీ మా ఇంటికి పిలిచాను.



సుందరం, అతని టీము సభ్యులు మద్రాసులో సినిమా ఫీల్డులో పనిచేసేవాళ్లుట. 'చిత్ర పరిశ్రమా! ఛలో హైదరాబాద్' అన్న ముఖ్యమంత్రుల పిలుపులు విని పెట్టే బేడాతో చార్మినార్ రైలెక్కేశారుట . వీళ్లెక్కిన రైలు టైముకే చేరినా చిత్ర పరిశ్రమ తరలింపు మాత్రం జీవితకాలం లేటుట. దాంతో వీళ్లు నిరుద్యోగంతో హైదరాబాధలు పడుతూ బతుకుతెరువు కోసం తమ విద్యలను వినియోగిస్తున్నారట.

లీడర్ల సభలకు వచ్చిన లారీడు జనాల్ని లక్షలాది జనంగా ట్రిక్ ఫోటోలు తీయడం, 'ప్రజల వాకిట్లో పాలన', 'నేతల పెరట్లో లాలన' వంటి కార్యక్రమాలకు తల చెరిపించుకొనే బాలలనూ, కన్నీళ్లు కార్చే ముసలమ్మలనూ సప్లయి చేయడం, కవిసమ్మేళనంలో పాల్గొన్న కలక్టరుగారి కవితాగానానికి హాహాకారాలు చేయగల రసజ్ఞుల నుండి, వారి సతీమణి ఓదార్చడానికి ప్రొలిటేరియటు సతీమణులదాకా అన్ని రకాల వేషాలు వేయగల

అర్టిస్టుల నందుబాటులో ఉంచడం – ఇత్యాది అనేక పనుల్లో ఆరితేరారుట వాళ్లు.

విషయం చెప్పి 'చేయగలరా?' అన్నాను.

"చెప్పుకోగూడదుగానీ ఇది మా స్పెషలైజేషన్ సార్. ఇప్పటిదాకా ముగ్గురు బాబాల మార్కెట్టు డౌనయిపోతే నిలబెట్టాం. నాలుగు పల్లెటూళ్లల్లో గ్రామదేవతలను పునరుద్ధరించి అక్కడ ఫ్యాక్టరీలు పెట్టేవాళ్ల దగ్గర్నుంచి బోల్డంత నష్టపరిహారం వసూలు చేసి పెట్టాం. ఇవన్నీ ఎందుకండి. ప్రస్తుతం కోస్తాలో, రాయలసీమలో బాగా పాపులర్ అయిన ఇద్దరు దేవుళ్లు మేం సృష్టించినవాళ్లే కదండీ!

"ఆర్నెల్లక్రితం వాళ్ల పేర్లు తమరెక్కడైనా విన్నారా సార్? మా ప్రొడ్యూసర్‌గారొకరు పార్టనర్లతో మాటామాటా వచ్చి తెరమీద బొమ్మలు తయారుచేయడం ఓ విద్యా? నిజజీవితంలో సృష్టిస్తాను చూడండి' అని ఛాలెంజి చేసి బయటకు వచ్చేసి సినిమాకు పెడదామనుకొన్న పెట్టుబడి ఖర్చుపెట్టి ఆ ఇద్దరు దేవుళ్లను ఒక ఆడ, ఒక మగ పుట్టించేరండి.

"మాకు ఇప్పటిదాకా తగిలిన పెద్ద కాంట్రాక్టు అదేనండి. కొత్త పురాణాలు రాయించడం, వారి మహిమల గురించి పెద్ద మనుషుల చేత సర్టిఫికేట్లు పేపర్లలో వేయించడం, రైళ్లల్లో, బస్సుల్లో ఏజంట్లను ప్లాంట్ చేసి మహత్తులు చెప్పించడం, ఆ స్వామి మహత్యంపై సినిమా తీస్తున్నారనీ, పెద్ద పెద్ద స్టార్లు, 'గెస్ట్'లుగా, ఫీజు ఏమీ తీసుకోకుండా నటిస్తున్నారని వార్తలు రాయించడం, చచ్చేటన్ని నియమ నిబంధనలతో స్వామి పూజ చేయాలనడం 'ఇరవై కాపీలు తీసి పంపుతావా? దారున ఛస్తావా' అని కరపత్రాలు పంచటం – ఒకటేవిటండి. సవాలక్ష పన్లు చేశాం. దేవుళ్లు నిలబడ్డారు. జనం నమ్మారు. ముక్కోటి దేవతలకు తోడు ఇంకో ఇద్దర్ని చేర్చుకున్నారు. వెనకొచ్చిన దేవుళ్లు కాబట్టి వాడిగా, వేడిగా ఓ వెలుగు వెలుగుతున్నారు. మా క్లయింటు గారి బంధువర్గమంతా ఆ దేవుడిగుళ్ల బయట షాపులు పెట్టి లక్షలు సంపాదిస్తున్నారు. పెట్టుబడి మూణ్ణెళ్లల్లో తిరిగొచ్చేసిందండి. ఇకపై వచ్చేదంతా లాభమే!"

"అది సరేనయ్యా, మనక్కావలసింది దెయ్యాలు, దేవుళ్లు కాదు"

"తేడా ఏముంది సార్? రెండూ, నమ్మకంలోంచి పుట్టుకొచ్చేవే కదా! అభూతకల్పనలంటే చెవి కోసుకుంటారు. చిన్నప్పట్నుంచీ విన్న దెయ్యాల కథలకు వ్యతిరేకంగా ఉండనంతకాలం నమ్మితీరతారు. రంగుచీర కట్టుకొచ్చిందంటే 'దెయ్యం కాదేస్' అనేస్తారు. తెల్లచీరే కడతాం. మనదగ్గర చాకుల్లాంటి కుర్రాళ్లున్నారు. రంగడని మా వూరివాడే ఎవరికైనా సరే పాదాలు వెనక్కి తిరిగినట్టు సూపర్బ్‌గా ఫోటో తీయగలడు. వాడి తమ్ముడున్నాడు – ఒట్టి లైటు మనిషి ఆకారంలో తిరుగుతున్నట్టు లైటెలిగిస్తాడు. ఇవన్నీ మాకొదిలేయండి. నెల్లాళ్ల తర్వాత మేం వచ్చినప్పుడు మీరు 'శభాస'ని భుజం తట్టి పుల్లు పేమెంటుతో బాటు బోనస్ ఇవ్వకపోతే నన్నడగండి. పెద్ద మనుషులు కదాని అడ్వాన్సు లేకుండానే పనికి దిగుతున్నాం. పూర్తయ్యేక మాత్రం పేమెంటు ఆలస్యం చేయకండి" అన్నాడు.

దేవుళ్లనూ, దెయ్యాల్నీ సృష్టించేవాళ్లని దేవాంతకులనకూడదేమోగానీ సుందరం టీము వాళ్లను వర్ణించడానికి అంతకంటే వేరేమాట దొరకటం లేదు. వారంరోజుల్లోనే ఆ ఊరినుండి ఈ ఊరిదాకా ఎన్నో వార్తలు వ్యాపించాయి. రచ్చబండల్లో, చాకిరేవుల్లో, బల్లకట్టు దగ్గిర, 'కాఫీ' హోటళ్లలో – అన్ని చోట్లా సుందరం మనుష్యులు చొచ్చుకుపోయి ప్రచారం చేసేశారు. బట్టలు చిరిగి పోవడాలు – పాలసైకిలు వాళ్లని లిఫ్ట్ అడిగే మగదెయ్యాలు, సెకండ్‌షో నుండి తిరిగొచ్చే యువకులకు కన్నుగొట్టే ఆడదెయ్యాలు, కాళ్లు పొయ్యిలో పెట్టి వంటొండే ముసలిదెయ్యాలు, వీటన్నిటోబాటు ఆ ఇంట్లో కాపురం పెట్టిన పిల్లా పీచూ దెయ్యాలు, గజ్జెలమోతలు, ఏడుపులు, కూతలు – ఒకటేమిటి సుందరం టీము చేసినదానితోబాటు స్వంతకల్పనాశక్తికి యథాశక్తి పనిచెప్పి జనాలు పబ్లిసిటీ ఇచ్చేశారు.

ఇవన్నీ 'పల్లెటూరివాళ్ల కాలక్షేపం కబుర్లులే' అని కొట్టేయబోయిన పట్నవాసులు దెయ్యాలను చూడడానికి ఓ వర్ధమాన తారడు ఆ బిల్డింగుకి వెళ్లడంతో ఉలిక్కిపడి వాళ్లూ వింత చూడబోయారు. వాసు ఇంటికి రోజూ ఫోన్లే – 'నిజమేనా?' అంటూ.

ఇలా మూడువారాలు గడిచేక ఇక దీన్ని 'ఎన్‌కాష్' చేసుకోవాల్సిన సమయం వచ్చిందనుకొనే

సమయానికి ఊడిపడ్డాడు సుందరం – డబ్బుకోసం కాదు – పనిమానుకుంటానని చెప్పడానికి!

సుందరం ట్రూపువాళ్లు పనిమొదలెట్టిన రెండు, మూడు రోజులకే నిజంగా దెయ్యాలున్న నిదర్శనాలు కనబడ్డాయిట. రాత్రిపూట గదుల్లో మంటలు వచ్చేవట. బయట ఆరేసిన బట్టలు తగలబడినట్టు చూపడానికి నిప్పు ముట్టించడానికి వెళితే అవి అంతకుముందే కాలిపోయి ఉండేవట. గజ్జెలమోతలు వాళ్ల సృష్టి కాదట. వాళ్ల గజ్జెల్లో మువ్వలుపోతే కొత్తవి తెప్పించేదాకా ఆగారుట. తీరాచూస్తే రాత్రి పడుకున్నవాళ్లకు ఎక్కణ్ణుంచో గజ్జెల మోతలు వినబడ్డాయిట. అలాగే ఏడుపులు, కేకలు మాత్రమే వీళ్ల 'ఎరేంజ్' చేస్తే ఎక్కణ్ణించో నక్కకూతలు వినబడుతున్నాయిట. దాంతో ఇతని మనుషులకు దయ్యాలు నిజంగా ఉన్నాయని భయం పట్టుకుందిట. పెళ్లాం బిడ్డలున్న వాళ్లం, పనిమానుకుపోతాం' అని అలెగ్జాండరు సైనికుల్లా మొండికేశారుట.

నేను మళ్లీ బుర్రకు పని చెప్పవలసివచ్చింది. "పోనీ దీన్ని బేతాళనిలయంగా మారిస్తే?" అన్నాను కాస్సేపయ్యాక.

"అంటే?"

"దెయ్యాలు ఉన్నట్టు అందరికీ నమ్మకం కుదిరింది కాబట్టి, ఇక్కడ వాటి ఆరాధ్య దైవం బేతాళుడు వెలిసేడని చెప్పండి. మీ వాళ్లందర్నీ గుడిలో రకరకాల పనులకు కుదిర్చేయి. సాధ్యమైనంత వికృతంగా, హడిలిచచ్చేలా పూజా విధానం 'ఫిక్స్' చేయి. ఎక్కడెక్కడి దెయ్యాలు పట్టినవాళ్లూ ఇక్కడి కొస్తే నయమవుతుందని ప్రచారం చేయించు. మీవాళ్లు జంకుతూంటే భూతాధిదేవత కొలువై ఉండగా భూతాలూ, పిశాచాలూ ఏమీ హాని చెయ్యవని నచ్చచెప్పు. అంతగా కావాలంటే రాత్రిళ్లు పనిచెయ్యవద్దను. గుడిమీద వచ్చే ఆదాయంలో నాలుగోవంతు మాత్రం మా వాడికి పంపి తక్కినది మీరు ఉంచుకోండి" అన్నాను.

ఈ అయిడియా 'క్లిక్' అయింది. బేతాళాలయం ఆ పాడుపడ్డ భవంతిలోనే (కొత్తది కట్టబోతే కాలి దగ్ధమయిపోయిందన్న పుకారు కూడా పుట్టించారు) వెలిసి మా వాడికి డబ్బు రావడం కూడా మొదలయింది. కానీ ఎప్పుడో ఓ రోజు దెయ్యాలు వచ్చి ఆ డబ్బు ఎగరేసుకుపోతాయనే భయం పోలేదు వీడికి – వీరగిరి జమీందారు గారు వీరింటికి వచ్చేదాకా –

"చేసిన పాపం చెబితే పోతుందన్నారు బాబూ. మీరు ఫరాయివాళ్లుగారు కాబట్టి నిజం చెప్పేస్తున్నాను. మా బిల్డింగు అమ్ముడుపోవడం లేదుకదాని బొంబాయిలో ఒకతన్ని సంప్రదించాను. దాంట్లో భూతాలూ, పిశాచాలూ ఉన్నాయని వదంతి పుట్టిస్తే పదిమందికీ దాని గురించి తెలుస్తుందనీ, ఏ టూరిస్టు డిపార్టుమెంటువాళ్లో, ప్రైవేటు హోటలువాళ్లో వచ్చి కాస్త శాంతులూ అవీ తతంగం జరిపించి ఓ 'ధాబా' లాటిది పెట్టి ఫారిన్ టూరిస్టులను ఆకర్షించవచ్చునీ సలహా ఇచ్చారు. సలహాతోబాటు ఒకణ్ణి అప్పచెప్పాడు.

అతనికి డబ్బు ఇచ్చి మా బిల్డింగు అడ్రసు ఇచ్చి పంపా. అతను 'సోలో ఆర్టిస్టు'. ఎవరికీ తెలియకుండా రాత్రుళ్లే పనిచేస్తాడు. గుట్టుగా పనిచేయడంలో ఓ పొరపాటు జరిగిపోయింది. మా బిల్డింగు అనుకొని ట్రిక్కులన్నీ మీ దాంట్లో చేసేడట. మాది 'కాంపౌండువాల్' లేని బిల్డింగని చెప్పా. మీ దాని కాంపౌండ్‌వాల్ ఈ మధ్యే కూలిపోయిందటగా, నాకు తెలీదు. పైగా దయ్యాల కొంపకు కావలసిన హంగులు మీ దానికే ఎక్కువున్నాయి. వాడికి తెలుగు రాదు, నాకు హిందీ రాదు. ఎక్కడో 'కమ్యూనికేషన్ గాప్' వచ్చింది. ఆ ఇంట్లో తిష్టవేసినవాళ్లను హడలగొట్టడానికి అతన్ని నియోగించాననుకొన్నాడు. మీ వాళ్లు ఆ ఇంట్లో తచ్చాడుతూంటే వాళ్లకు తెలీకుండా గమ్మత్తులు చేశాడుట.

నాకివన్నీ తెలియవు. కాలు విరిగితే కేరళాలో పల్లెటూళ్లో ప్రకృతివైద్యం చేయించుకొని తిరిగి వచ్చాను. చూస్తే మా బిల్డింగుమాట తలచేవాడే లేదు. మీ దాంట్లో ఓ బేతాళాలయం, వచ్చే జనం, పోయే జనం..."

"అయితే ఏమంటారు ఇంతకీ" అన్నాడు వాసు గొంతు తడారిపోతూండగా.

"కంగారు పడకోయ్. జరిగిందేదో జరిగిందిలే. నా సలహా ఏమిటంటే – ఆ బేతాళాలయానికి ట్రస్టు ఏర్పాటు చేసి మనిద్దరం ట్రస్టీలుగా ఉందాం. మా ఇంటిని ఆ దేవస్థానం – దేవస్థానం అనచ్చా? దెయ్యస్థానం అనాలా? – సత్రంగా ఫిరాయిద్దాం. దెయ్యం వదిలించుకోడానికి వచ్చినవాళ్లు బస చేయడానికి బంగళా ఉండద్దుటోయ్? బిల్డింగు పాతగానే ఉందనుకో. అయినా దెయ్యం పట్టినవాళ్లకి కొత్తిల్లు ఇస్తే అన్నీ విరగ్గొట్టేస్తారు కూడా... ఏమంటావు? మీ నాన్నగారికి ప్రాణస్నేహితుణ్ణి, పెద్దముండావాణ్ణి, డబ్బు ఇబ్బందుల్లో ఉన్నాను. మాటకొట్టేయకు" అంటూ చేతులు పట్టుకొన్నాడా పెద్దాయన.

సరేననక తప్పుతుందా?

●

(విపుల నవంబరు 1996)